అదేమిటో కనిపెట్టాలి' అనుకుంది దేవకి.

"ఏయ్ శారదా! మీ బావ సంగతి నీకు తెలియదా? అతనికి నువ్వంటే చాలా ఇష్టం. వేరే ఆలోచన్లేం పెట్టు కోకు. మీ అమ్మా నాన్నలకి కూడా ఈ విషయం ఏమీ చెప్పకు. నువ్వోసారి చక్రికి ఫోన్ చేయరాదూ" అంది దేవకి.

"ఫోన్ చేద్దామనే అనుకున్నాను. కానీ విషయం పూర్తిగా తెలుసుకోకుండా తనని అనుమానిస్తే తను హర్ట వుతాడేమో అని ఆగాను"అంది శారద.

"సరే! మనం ఇద్దరం ఆలోచించి ఏం చేయాలో చూద్దాం. ఇక నే వెళ్తాను" అంటూ నాలుగు కామిక్‌బుక్స్ ఆ ఫోటో తీసుకుని ఇంటికి వచ్చింది దేవకి.

ఇంటికి వచ్చినా మనసులో అదే విషయం కదలాడు తోంది. పుస్తకాలేం చదవబుద్ధి కాక ఆ ఫోటో తీసి చూస్తూ కూర్చుంది. చూడగా చూడగా ఆ ఫోటోలోని అమ్మాయిని ఎక్కడో చూసినట్లు అనిపించసాగింది. ముఖ్యంగా ఆ కళ్ళు. బాగా పరిచయమైన వ్యక్తిలా అనిపిస్తుంటే ఎక్కడ చూసి ఉంటుందా అని ఆలోచిస్తూ పుస్తకం పైన రాసి ఉన్న రెండవ గురువారం అన్న మాటనే చూస్తూ మంచం మీద పడుకుంది. అలా రాసిన గురువారం ఏప్రిల్ ఒకటని తేలింది. ఎదురుగా గోడకి వ్రేళ్ళాడుతున్న క్యాలెండర్ చూడగానే దేవకి మనసులో తళుక్కుమందో ఆలోచన. ఫోటోని చేతుల్లోకి తీసుకుని కాసేపు చూసింది. ఏదో ఒక ఊహ తోచి ఫోటోపైన నుదురు, క్రింది ముక్కు నించి గడ్డం వరకూ పేపర్‌తో మూసి మధ్యలో కనబడు తున్న కళ్ళని పరీక్షగా చూడగానే మిస్టరీ వీడిపోయింది. ఆ ఫోటోలో ఉన్నది చక్రధర్. అమ్మాయి వేషంలో ఫోటో తీయించుకుని శారదని ఏడిపించేందుకు అలా పంపాడ న్నమాట. ఒకే పుస్తకం ఇచ్చి దాన్లోనే ఫోటోపెట్టి పైన డేట్ వేస్తే అనుమానం వస్తుందని మొత్తం మూడు పుస్తకాలు తెచ్చి ఏప్రిల్ ఫస్ట్‌కి ముందు ఒకటి తర్వాత ఒకటి వచ్చే లోగా చదవమన్నాడన్నమాట. ఉదయమే శారదకి విషయం చెప్పాలి అనుకుంది దేవకి.

మరునాడు స్కూల్‌కి వెళ్లగానే శారదని కలిసి తను కనుక్కున్న విషయం చెప్పింది. ఫోటోని పరీక్షగా చూసిన శారద కళ్ళు మతాబాల్లా వెలుగులు చిమ్మాయి. దేవకిని ఎంతో మెచ్చుకుంది శారద. "సరే సరే! మరి మీ బావకి నువ్విచ్చే రిటార్ట్ ఏమిటి?" అంది దేవకి.

"నన్ను ఫూల్‌ని చెయ్యాలనుకున్నాడు కదా! నీ విషయం కనిపెట్టేశాను. కాబట్టి నువ్వే ఫూల్‌వి అయ్యా వని సరిగ్గా ఏప్రిల్ ఫస్ట్‌కి అందేలా లెటర్ రాస్తా" అంటూ గలగలా నవ్వింది శారద. ఆ నవ్వులో తనూ జతకలిపింది దేవకి.

**- సాధనాల నాగవర్ధని (నూజివీడు)**

# తగినశాస్తి

**ఎలక్షన్ కమీషనర్ శాసనసభ్యుల, పార్లమెంట్ సభ్యుల వ్యక్తిగత ఆస్తిపా స్తుల వివరాలు బహిర్గతం చేయండని హుకుం జారీచేశాడు. దాంతో కోట్లు గడించిన నాయకులు బెంబేలెత్తారు.**

మల్లగుల్లాలు పడి ఆస్తులు ఉన్నవి లేనట్లు, లేనివి ఉన్నట్లు సృష్టించారు. దినపత్రికలకు ప్రకటనలు పంపారు. వారిలో ఎమ్మెల్యే బందరాజు పంపిన ప్రక టన ఇలా ఉంది.

"ఇందుమూలంగా యావన్మందికీ తెలియజేయు నది ఏమనగా అయ్యా! నేను బండలకొండ నియోజక వర్గం శాసనసభ్యుడిని. పేరు బందరాజు. నేను రాజకీయ ల్లోకి రాకపూర్వమూ, వచ్చిన తర్వాత కూడా ఆస్తులన్నీ లెక్కగట్టినా లక్షలోపే. మా స్వగ్రామంలో ఎందుకూ కొర గాని పోరంబోకు భూమి నాలుగు గుంటలు ఉంది. పాతకాలంనాటి పెంకుటిల్లు ఉంది. ప్రస్తుతం నేను రాజ ధానిలోని సర్కారు వారిచ్చిన క్వార్టర్స్‌లో కాలం వెళ్లదీస్తు న్నాను. మా స్వగృహంలో నాలుగు వంటపాత్రలూ, రెండు ఫ్రేమ్ కుర్చీలు అవీ పాతవే. ఓ డొక్కు ఫ్యాన్, తిరు గుతున్నా గాలి రాదు. నీళ్ళు తాగడానికి మట్టి పాత్ర అంతే ఉన్నాయి. ఇంట్లో కలర్‌టీవీ గానీ, డబుల్‌డోర్ ఫ్రిజ్ , ఏసీ మిషన్, ఇంపోర్టెడ్ కారు లేదు. ఓ డొక్కు వాహనం ఉంది. అది మనుషులు నెట్టితేనే ముందుకి కదులు తుంది"

* * *

సమయం అర్థరాత్రి దాటి అపరాత్రి అయింది. సమస్త జీవరాశులు నిద్రావస్థలో ఉన్నాయి. అంతరాష్ట్ర తోడు దొంగలు డేవిడ్, లింకన్ ఓ ఇంటిముందు ఆగారు. ప్రహరీగోడకు ఉన్న శిలాఫలకంలో ఎమ్మెల్యే బందరాజు అన్న పేరు అంత చీకటిలో కూడా ప్రకాశిస్తోంది. వాళ్ల పెదాలపై చిరునవ్వు మందహాసం చేస్తోంది.

"మనం కొల్లగొట్టబోయే ఇల్లు ఇదే" అని నిర్ణయిం చుకున్నారు.

గేటు దాటి అతి చాకచక్యంగా ఇంట్లోకి ప్రవేశించారు డేవిడ్, లింకన్.

ఇంట్లో ఎవ్వరూ లేరు. చకచకా తమ పనులు చేసు కుపోయారు ఇద్దరూ. కలర్‌టీవీ, డబుల్ డోర్ ఫ్రిజ్, ఏసీ మిషన్, పట్టుచీరలూ, నగలూ, నగదూ ఉన్న బీరువాతో సహా కొల్లగొట్టి ఇంటి కాంపౌండులో ఉన్న ఇంపోర్టెడ్ కారులో పలాయనం చిత్తగించారు.

భార్యాపిల్లలతో ఎక్కడికో వెళ్ళిన బందరాజు తెల్లారి వచ్చి ఇల్లును చూసుకుని గొల్లుమన్నాడు. గుండెలు బాదుకున్నాడు. పదినిముషాల పాటు షాక్‌కి గురై తేరు కున్నాడు. 'పోలీసు రిపోర్టు ఇవ్వాలి' అనుకుని అంతలోనే మనసు మార్చుకున్నాడు.'ఇంట్లో పోయిన వస్తువుల గురించి రిపోర్ట్ ఇస్తే అసలుకే మోసం వస్తుంది. బ్లాక్ మనీ అంతా బహిర్గతమై జైలుకి పోయినా పోవాల్సి వస్తుంది' అనుకున్నాడు. తేలుకుట్టిన దొంగలా అయిపో యాడు బందరాజు.

**- ఒ.వెంకటేశ్వర్లు (కాటేపల్లి)**

